# మొదటి రోజు అనుభవాలు

రచన: వి. చక్రపాణి

'మీకు మీ నెంబర్లు తెలుసునా?' అన్నాను అటెండెన్సు తీసుకోబోతూ.

'తెలియదు సార్' అన్నాడు ఎడమవైపు వరుసలో ముందు బెంచీ మొదటి విద్యార్థి.

'తెలుసు సార్' అన్నాడు కుడివైపు వరుసలో ముందు బెంచీమధ్య విద్యార్థి.

'నువ్వు నోరు మూసుకోవోయ్' అన్నాడు ఎడమవైపువాడు.

'పిచ్చి పిచ్చిగా వాగకోయ్' అన్నాడు రెండో అతను. నాకిదంతా వింతగా తోచింది. మిగతా క్లాసంతా నిశ్శబ్దం.

'సిట్ డౌన్ బోత్ ఆఫ్ యూ ప్లీజ్' అన్నాను. ఇద్దరూ వినిపించుకోలేదు.

'నేనేదో చెబితే మధ్యలో పానకంలో పుడకలాగా నువ్వు లేస్తావెందుకోయ్. నీతో నేనేమన్నా చెప్పానా?' అన్నాడు ఎ. మొ. మొ. విద్యార్థి.

'నేనూ నీతో చెప్పలేదు తెలుసా' అన్నాడు కు. మొ. మ. విద్యార్థి.

'డోన్ట్ టాక్' అన్నాడు కోపంగా.

'షటప్. నువ్వు మానిటరువయితే అవుగాక. క్లాసులో మాస్టరుండగా నువ్వెవరవు?' అన్నాడు. ఇలాగయితే లాభంలేదు. ఊరుకొంటే తాటాకులు కట్టడం నిశ్చయమనుకొన్నాను' ఇంటివద్ద వేసుకొన్న ప్లానంతా వమ్మయిపోయింది గదరా భగవాన్!' అనుకొన్నాను.

'సరే పేర్లే పిలుస్తా కూర్చోండోయ్' అన్నాను.

'వద్దు సార్ నెంబర్లు అందరికీ తెలుసును నెంబర్లే పిలవండి' అన్నాడు కు. మొ. మ. విద్యార్థి.

'ముందు మాట్లాడకుండా కూర్చోండి' అన్నాను 'హుఁ! నాపంతమే నెగ్గింది' అన్నట్లు చూశాడు. ఎ. మొ. మొ. విద్యార్థి. 'పోవోయ్ నీ లెక్కేమిటి' అన్నట్లునిర్లక్ష్యంగా చూసి కూర్చున్నాడు కు. మొ. మ. విద్యార్థి. ఒక్కసారి క్లాసంతా కలియజూచాను దాదాపు నలభైమంది వుంటారు. దీర్ఘచతురస్రాకారంలోనున్న ఆ గదిలో పొడవునా రెండు వరుసలుగా విద్యార్థులు. ఎదురుగా నేనున్న స్థానం. నాకు చెరో వైపు నల్లబల్ల, రెండు బెంచీలమీద విద్యార్థినులు. అందరి ముఖాల్లోనూ ఒక విధమైన కుతూహలం, ఉత్సాహం స్పష్టంగా కనిపిస్తోంది. ఒకరికొకరు చెవుల్లో ఏవేవో చెప్పుకొంటున్నారు.

అటెండెన్సు రిజిష్టరు తెరిచాను. అందరి పేర్లు ఇంగ్లీషులో చక్కని దస్తూరితో వ్రాసి వున్నాయి. పేజీలు ముందుకు త్రిప్పాను మొత్తం సంఖ్య చూద్దామని, కోలాహలం బయలుదేరింది. ఆలస్యం చేయకూడదనుకొన్నాను. ఆఖరిసంఖ్య నలభై. చివరి పన్నెండుపేర్లు ఎఱ్ఱసిరాతో కొట్టివేసినట్టున్నాయి. 'ఆడపిల్లలు పన్నెండుమందా!' అనుకొన్నాను. మెల్లగా పేర్లుకూడ బలుక్కొని పిలుస్తూ ప్రజెంటు వేస్తున్నాను. అయినా అచ్చటచ్చటా తడబడుతూనే వుంది ఉచ్చారణ. నాకు తెలుసు. అసలు ఇంగ్లీషుతో వచ్చిన చిక్కేయిది. వసుదేవుడో, వాసుదేవుడో తెలీదు. తెలుగైతే బాధలేకపోయేది. రెంటిలో ఏది తప్పనగలం? అనుకోకుండానే 'వసుదేవుడ'నేశాను. క్లాసంతా గొల్లుమంది

కంగారు పడ్డాను. ఏం చేయాలో తోచలేదు. నోటివెంట మాట పెగలలేదు. అయినా నా భయాన్ని వ్యక్తం చేయకూడదనుకొన్నాను. 'ఇలాటి సంఘటనలు సహజం. మాష్టారియొక్క డాబు దర్పం కనిపెట్టాలంటే విద్యార్థులే సమర్థులు.' అనుకొని నన్ను నేను సరిపెట్టుకొన్నాను

"సైలెన్స్ ప్లీజ్" సద్దు మణిగింది.

'వాసుదేవుడున్నాడు గాని, వసుదేవుడెవరూ మా క్లాసులో లేరండీ' చటుక్కున లేచి నిలబడి నిర్భయంగా మాట్లాడిన ఆ విద్యార్థినిచూచి ఆశ్చర్యపోయాను. ఏడుపు వచ్చినంత పనైంది. మొన్న మొన్నటి వరకూ వెనక బెంచీలో కూర్చుని టీచర్ల నేడిపించిన నేను ఈ రోజు పెద్ద మనిషినై, ఉపాధ్యాయుడుగా నలభైమంది విద్యార్థుల ఎదుట నిలవడమా! ఆలోచనలతో సతమత మౌతుండగా ఒక్కసారి మెరుపు మెరసినట్లయింది.

'సారీమైబోయ్! సిడౌన్ప్లీజ్' అన్నాను చిఱునవ్వుతో.

అటెండెన్సు తీసుకోవడం పూర్తయింది. 'మీ క్లాసు మానిటరు ఎవరు?' అన్నాను

'నేనే సార్' ఎడమవైపు మొదటిబెంచీ మొదటి విద్యార్థిని నిలబడ్డాడు గర్వంగా.

'వెరీ గుడ్. అసిస్టెంట్ మానిటరో?' అన్నాను. కుడివైపు మొదటిబెంచీ మధ్య విద్యార్థి నిలబడ్డాడు. ఆశ్చర్యపోయాను. ఒకరు మానిటరు, మరొకరు అసిస్టెంటు మానిటరూను. ఇద్దరిమధ్య బద్ధవైరం! క్లాసులో రెండు పార్టీలున్నట్లు, వాటికి వీరిద్దరూ నాయకులని గ్రహించటానికి టైమేమీ తీసుకోలేదు.

'మాష్టారు మీ పేరేమిటండీ' అన్నాడు. మానిటరు. అపోజిషన్ పార్టీ ఎందువల్లనో మాట్లాడలేదు.

'వెళ్ళి పీస్ ఆఫ్ చాక్ తీసుకొని రా' అన్నాను.

'అలాంటి పనులకు అసిస్టెంటు మానిటరున్నాడండీ' అన్నాడు.

'పిచ్చి పిచ్చిగా వాగకోయ్. కావాలంటే తెచ్చుకోలేకపోతే మానుకో' అన్నాడు అన్నాడు కోపంగా అసిస్టెంటు మానిటరు.

(తరువాయి 22 వ పేజి)

# ప్రసవించిన తల్లికి విశ్రాంతి కూడదు

## మాతృమూర్తులకు ముఖ్య సలహా !

(హెరాల్డ్ ఓయిల్కర్స)

హాంబర్గ్ (డాడ్) : శిశుజననం కాగానే, లేచి తిరగటం తల్లికి చాలా ప్రమాదకరమనీ, అలా జరుగకూడదనీ నేటికీ డాక్టరంతా చెపుతూ వుంటారు ఈ అభిప్రాయం తప్పు. ఇది కేవలం నిరాధారమయినది.

పశ్చిమ జర్మనీలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎ. వోగల్ యీ అంశం గురించి ఎంతో కుతూహలమైన సత్యాలను వెలుగులోకి తెచ్చారు. ఇది కేవలం ప్రాచీన అభిప్రాయం అనీ ఆ రోజులు మారిపోయాయనీ, ఎంతటి ఆపరేషన్ తరువాత నయినా తల్లి లేచి తిరగటంవల్ల ఎన్నో లాభాలు సిద్ధిస్తాయని డాక్టర్ కథనం! అలా తిరగటం వల్ల తల్లిలోవుండే అస్వస్థత నిమిషాల మీద తొలగిపోతుందిట

తన వాదాన్ని సమర్థించుకొంటూ డాక్టర్ వోగల్ ఒక వుదాహరణాన్ని కూడా యిచ్చారు. ఒక మంచి క్రీడాకారుడున్నాడంటే, పరుగుపోటీ జరిగిన మరుక్షణంలోనే విశ్రాంతి పుచ్చుకోటం వాంఛనీయం కాదు. చక్కని శిక్షణ పొందిన ఒక వ్యక్తిని మరుక్షణంనుంచీ ఒకవారం రోజులపాటు విశ్రాంతి పుచ్చుకోమని సలహాయిస్తే, అసలుకే ముప్పు రాగల ప్రమాదం వుంది. ఒక వాతావరణంనుంచి మరో వాతావరణంలోకి మారటం క్రమేణా జరగాలేగాని, అకస్మాత్తుగా జరుగకూడదని ఆ వైద్యుని వివరణ.

గ్లుక్‌స్టాడ్ సిటీ హాస్పిటల్‌లోని ప్రధాన వైద్యులు డాక్టర్ వోగల్ తాను చెప్పిన మాటలను ఆధార రహితంగా చెప్పలేదు. ఈ సత్యాన్ని అనుభవపూర్వకంగానే తెలిసికోవటం జరిగింది. పైగా, ఆయన తన వద్దకు వచ్చే పలువురు మాతృమూర్తులను ఉదాహరణకు పరిశీలించారు. 'ప్రసవించిన వెంటనే తల్లి లేచి తిరగటంవల్ల ఆమె ఆరోగ్యంలో ఎలాంటి మార్పులేదు. అలా కాకుండా మంచంలో పడుకొని వుండటంవల్ల దేహంలో కొన్ని అవాంఛనీయ అవలక్షణాలకు తావు లభిస్తుంది,' అన్నారాయన.

(యు. పి. ఎస్.)

## మొదటిరోజు అనుభవాలు

(7 వ పేజీ తరువాయి)

'పోవోయ్ పెద్ద చెప్పొచ్చావ్' అంటూ వెళ్ళి సుద్దముక్క పట్టుకొని వచ్చాను.

RAMA VILAS

'చదువవోయ్ దీనిని' అన్నాను బోర్డుపై వ్రాసిన మాటలను చూపుతూ వాసుదేవుడితో

'రామావిలాస్' అన్నాడు. లేనినవ్వు తెచ్చిపెట్టుకొని పక పక నవ్వాను. ఆ వైపు విద్యార్థుల ముఖాలు వాడిపోయాయి. మరో విద్యార్థి నడిగాను. పాపం నోట్లోనుండి మాటే రాలే దతనికి.

'అసిస్టెంటు మాస్టరు చెబుతాడు చూడండి' అన్నాను.

'రమావిలాస్ సార్' అన్నాడు వినయంగా

'వెరీ గుడ్' అన్నాను.

'రామావిలాస్ ఎందువలన తప్పు?' దేనికోసమైతే ఎదురుచూచానో అదే ప్రశ్న వేశాడు మాస్టరు.

"'VASUDVEUDU' వసుదేవుడంటే తప్పేమిటి?' అన్నాను.

'మేము తప్పని లేసుగా అలాంటివారు లేరన్నాం' సమర్థించుకోబోయాడు.

'ఇది మాత్రం తప్పన్నారా మాస్టారు. రామ విలాస్ లేదని దానర్థం' చిక్కిందని సమయమనుకొని నాభాషాసత్తనే ఉపయోగించుకొన్నాడు అసిస్టెంటు మాస్టరు.

'సంతోషించాం లే తమ తెలివికి' అన్నాడు ఎటకారంగా మాస్టరు.

'ఏడవలేకపోయావు సంతోషించకపోతే'

చూస్తుంటే. చాలా అసాధ్యులులా కనబడ్డారు ఒకరినిమించి మరొకరు. గతజన్మలో విద్దరు ఏవో రెండు పెద్దపార్టీల నాయకులైయుండాలి అనుకొన్నాను.

'క్లాసులో టీచరుండగా అలా పోట్లాడుకోవచ్చా. కూర్చోండి' అన్నాను. కూర్చున్నారిద్దరు.

నిశ్శబ్దం.

'మాష్టారు మీరే సబ్జక్టు వస్తారండి మాకు' నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ నిలబడి ప్రశ్నించిందొక బాలిక.

'ఏమోనమ్మా. హెడ్మాష్టారిగారి ఇష్టం' అన్నాను. కూర్చున్నదా బాలిక.

'బహుశా ఇంగ్లీషుకే వేస్తారండీ' ఒక బాలుడు గొణిగాడు మూలనుంచి

'ఏం?'

'మీస్థానంలో పనిచేసిన మాష్టారు ఇంగ్లీషుకే వచ్చేవారు'

అయితే నేనూ ఇంగ్లీషే తీసుకోవాలన్న నియమమేమిటి అనుకొని 'ఉహూ' అన్నాను.

'ఇంతకీ మీపేరు చెప్పారు కాదండి' మరో విద్యార్థి లేచాడు.

'నా స్థానంలో పని చేసిన మాష్టారి పేరేమిటి?'

'రామారావుగారు'

'అయితే నా పేరు అదే'

'ఎలాగవుతుందండీ'

'ఆయన స్థానంలోనే గదా వచ్చింది నేను' అన్నాను నవ్వుతూ. అసంతృప్తిగా కూర్చున్నాడా విద్యార్థి గత్యంతరంలేక.

అయిదు నిముషాలు మౌనంగా గడిచాయి

'కథేదైనా చెప్పండి మాష్టారు'

'నాకేమీ రావు నువ్వు చెప్పు ఒకటి'

'మీ స్థానంలో పనిచేసిన మాష్టారు చక్కని కథలు చెప్పేవారండి'

'అయినా నాకు రావు'

'ఆయనస్థానంలోనే గదండి మీరువచ్చింది'

'ఓరినీ! నామాట నాకే ఒప్పజెప్పారే' అనుకొన్నాను.

'మీరంతా చాలా తెలివిగలవాళ్ళు. ఏదీ ఒక పద్యం...' అన్నాను.

'మాకింతవరకు ఏమీ చెప్పలేదండీ, అన్నాడా విద్యార్థి.

గణ గణ మని ఇంటిబెల్లు మ్రోగింది.

కుర్చీలోనుంచి లేచి రెండడుగులు ముందుకు వేశాను.

'మాష్టారూ! మధ్యాహ్నంకూడా వస్తారాండి మీరు?'

'ఏమో' అంటూ ముందుకు గబగబా నడిచాను.

'రామూ! ఎలా వుంది ఫస్టుడే ఎక్స్పీరియన్సు' నవ్వుతూ ఎదురు వచ్చారు హెడ్మాష్టారు.

'వండ్రఫుల్ సార్' అన్నాను సంతోషావేశాలతో.

'ఎలా వున్నారు విద్యార్థులు' అన్నారు నాసంతోషానికి తనలో తనే నవ్వుకొంటూ

'చాలా ఘటికులండీ' అన్నాను.

'అరే! నీకంటె ఘటికులా, రఘురావ్!' అంటూ ఆయన పకపకా నవ్వుతూంటే, నేను శ్రుతి కలిపాను. పరుగు పరుగున పోటీతో వస్తూన్న మానిటరు, అసిస్టెంటు మానిటరు మాయిద్దరి సంభాషణ విని గతుక్కుమన్నారు.

పాపం వాళ్ళకేం తెలుసు వాళ్ళ గురువూ గురువుకు తాటాకులు కట్టిన వాడేనని!

---

# జోక్సు కార్నర్

పోలీస్ ; ఏయ్ రిక్షా... రాత్రి పూట లైట్ లేకుండా పోతున్నావేం?

రిక్షావాలా: ఏం చేస్తాంసార్. కిరసనాయిల్ కరువు. దానికితోడు 'బ్లాక్ అవుట్' ఒకటి పెట్టారు గదా! మీకు తెలీనిదేంవుంది?

◆ ◆ ◆

రంగారావు :– "నువ్వు కుర్రాడివి గదా. నీక్రింద పనిచేసే గుమాస్తాలనందర్నీ 'రిటైర్' అయిన వాళ్ళే కావాలని ప్రకటించావేం'

రామారావు:–'అదేనోయి తమాషా వాళ్లయితే సర్వం ఉడిగినవాళ్లు మనం నాలుగు తిట్టినా పడి వుండగలరు."

◆ ◆ ◆

'పొరపాటు' నాటిక ప్రదర్శిస్తున్నారు కొందరు ఔత్సాహిక నటీనటులు. నాటిక మధ్యలో స్టేజీమీదకి ఒక చెప్పు దూసుకొచ్చింది నటీనటులు కంగారు తిన్నారు హీరోగారు 'బ్బె బ్బె బ్బె' అంటూ 'ఏమిటి, ఏమిటి యిది?' అన్నాడు చెమటలు క్రక్కుతూ. ప్రేక్షకుల్లోంచి ఏకగ్రీవంగా వచ్చింది సమాధానం– "పొరపాటు!"

◆ ◆ ◆

సినిమా సమీక్షకుణ్ణి అతని అంతరంగిక మిత్రుడు అడిగేడు, 'ఏమిత్రా, ఆ ఘోరమైన 'వీర బోరు' సినిమా అంత గొప్పగా ఉన్నట్లు రాసేవ్?'

సి. స. జవాబు :– ఆ నిర్మాత కాస్త పిసినారయిపోయాడు కాని, లేకుంటే యింకాగొప్పగా రాసేవాణ్ణి!'